భయంభయంగా ప్రయాణం

- ప్రమాదాలకు నిలయంగా మారిన మూలమలుపులు
- ఆందోళనలో మండల ప్రజలు
- కానరాని సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు

ఎలిగేడు: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే దారులు, గ్రామాల్లోని ప్రధాన రహదారులు మూలమలుపులతో ప్రమాదకరంగా మారాయి. అధికారులు మూలమలుపుల వద్ద కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. మండలంలోని ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి వెళ్లే దారులు చాలా ప్రాంతాల్లో మూలమలుపులు ఉన్నాయి. కానీ సూచికబోర్డులు ఎక్కడా కానరావడం లేదు. దీంతో రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

గ్రామాల మధ్య..

రోడ్డుపై వేళ్లే సమయంలో ప్రజలు భయంభయంగా ప్రయాణిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు సైతం మూలమలుపులను చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ధూళికట్ట, ముప్పిరితోట గ్రామాల మధ్య మూడు మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. లాలపల్లి, ఎలిగేడు మధ్య రెండు మూలమలుపులు, ఎలిగేడు, సుల్తాన్‌పూర్ గ్రామాల మధ్య, వడ్కాపూర్, ధూళికట్ట గ్రామల మధ్య, బుర్హాన్‌మియాపేట నుంచి గర్రెపల్లికి వెళ్లే దారిలో, నారాయణపల్లి నుంచి బుర్హాన్‌మియాపేట మధ్యన, ర్యాకల్‌దేవుపల్లిలోని క్రాసింగ్ వద్ద, తదితర చోట్ల గ్రామాల్లో రోడ్లపై మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి.


ధూళికట్టలో ముప్పిరితోటకు వేళ్లేదారిలో మూలమలుపు

పట్టించుకోని అధికారులు..

మూలమలుపులు సరిచేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులకు తోడు రోడ్డుపక్కన ముళ్లపొదల చెట్లు ఉండడంతో రోడ్డు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మూలమలుపులకు తోడు సింగిల్ రోడ్డు ఉండడంతో వాహనాలు వేగంగా వచ్చి అదుపు కాకపోవడంతో రోడ్డు కిందకు దూసుకెళ్లి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూలమలుపుల వద్ద పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు స్పందించి సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఎలిగేడు మండంలో మూలమలుపు

మూల మలుపులను సరిచేయాలి



మా గ్రామానికి వెళ్లే దారిలో మూడు మూలమలుపులు ఉన్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వీటితో రోడ్డుపై వెళ్లే సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులను సరిచేయాలి. అప్పటివరకు సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి.

– బాసంపల్లి కొండయ్య, లాలపల్లి

రక్షణ చర్యలు చేపట్టాలి



మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధానరోడ్ల వెంట మూలములుపులు ప్రమాదకరంగా మారాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు రక్షణ చర్యలు చేపట్టి, మూలమలుపులను సరిచేయాలి. లేదా సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

– భూసారపు సురేశ్, ధూళికట్ట

విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

మంథని: పట్టణంలోని బొక్కలవాగు వంతెనపై ఏర్పాటు చేసిన తెలంగాణ పోరాట యోధుడు, తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలని జెడ్పీచైర్మన్ పుట్ట మధు కోరారు. మంథనిలోని తన నివాసంలో జెడ్పీ చైర్మన్ శనివారం విగ్రహావిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించారు. 4న నిర్వహించే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రావాలని కోరారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, ఇతర నేతలు హాజరవుతారని తెలిపారు.

హాస్టల్‌లో సీట్ల సంఖ్య పెంచాలి


వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో సీట్ల సంఖ్య పెంచాలని, బీసీ కులాలకు చెందిన విద్యార్థులకు కూడా అవకాశం కల్పించాలని కోరుతూ శనివారం కలెక్టర్ సంగీతసత్యనారాయణకు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు గొడుగు రాజు, రాజ కొమురయ్య ఉన్నారు.

క్లుప్తంగా

ప్రాజెక్టు అధికారికి సన్మానం


సన్మానిస్తున్న జీఎంలు

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2 ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహించిన ఎం.నరేందర్ బెల్లంపల్లి ఏరియాకు ఎస్‌వోటూ జీఎంగా బదిలీ అయ్యారు. కాగా శనివారం జీఎం కార్యాలయంలో ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అధికారులు సన్మానించారు. అధికారులు ఎలీషా, బైద్య, రఘుపతి, రాధాకృష్ణ, రమేశ్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, పద్మరాజు, మారుతి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆఫీస్ సబార్డినేట్‌కు..


సన్మానిస్తున్న ఎంఈవో సంపత్‌రావు

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన కవ్వాల రమేశ్‌ను కమాన్‌పూర్, రామగిరి, పాలకుర్తి, రామగుండం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు, సదయ్య, శ్రీనివాస్, సారయ్య, రాజేశ్వర్‌రావు, మల్లేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీ అధికారికి..


సన్మానిస్తున్న నాయకులు, కార్మికులు

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2 ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహించిన నరేందర్ బీపీఏ ఎస్‌వోటూ జీఎంగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనను శనివారం ఓసీపీ–2 ప్రాజెక్టు కార్యాలయం వద్ద బీఎంఎస్, ఏఐటీయూసీ నాయకులు సన్మానించారు. బీఎంఎస్, ఏఐటీయూసీ నాయకులు మల్రి సంతోష్, కొండ్ర నగేష్, జానీ, ఎంఆర్‌సీ రెడ్డి, సాంబశివరెడ్డి, ఎస్వీ రాజు, కృష్ణమూర్తి, సురేందర్, రామ్మూర్తి, శ్రీనివాస్, సదానందం, రవీందర్, సర్వర్ హుస్సేన్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పాలకుర్తి మండలం రామారావుపల్లిలో నేతకాని కులస్తుల కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు మంత్రి ఈశ్వర్ శంకుస్థాపన చేసి నాలుగేళ్లు దాటినా పనులు ఇప్పటికీ మొదలు కాలేదని నేతకాని సంఘం నాయకులు వాపోయారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని నాయకులు సత్యనారాయణ, బాబునాథ్, పోచయ్య, రమేశ్, అశోక్ కోరారు.

రేపు ఆశ్రమంలో గురుపూజోత్సవం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీమదచలర్షి రాజయోగీశ్వర సంక్షేమాశ్రమంలో సోమవారం గురు పూజోత్సవం కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆశ్రమ గురు పీఠ అధ్యక్షుడు శ్రీసత్యానంద కన్నం సత్యనారాయణ శనివారం తెలిపారు. గురుపూజోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెద్ద మోరీలో పూడికతీత పనులు



రామగుండం: వర్షాకాలం ఆరంభంలోనే వరద ముంపును ఎదుర్కొనేందుకు 21వ డివిజన్ పరిధిలోని పెద్ద మోరీలో ముమ్మరంగా పూడికతీత పనులను కార్పొరేటర్ అమ్రీన్ ఫాతిమా ఆధ్వర్యంలో చేపడుతున్నారు. కాగా గతేడాది కురిసిన భారీ వర్షాలతో పెద్ద మోరీలో వచ్చిన వరద దాటికి పక్కనే ఉన్న పాతబజార్‌లోని గృహాలు, జెన్‌కో క్వార్టర్లు పూర్తిగా జలమయమయ్యాయి. అయితే వరద ముంపు నుంచి గృహాలకు రక్షణ కల్పించేందుకు పెద్ద మోరీ నుంచి వరద నీరు పోటెత్తకుండా మట్టితో ఎత్తుగా కరకట్ట ఏర్పాటు చేస్తున్నారు.

బియ్యం అందజేత

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో జూలై 3 సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న అన్నదానానికి శనివారం విజయానంద్ 25కేజీల బియ్యం అందజేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవం


పెద్దపల్లిరూరల్: సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు


రామగిరి: సన్మానిస్తున్న క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్


రామగుండం: సన్మానిస్తున్న లింగాపూర్ గ్రామస్తులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ పీహెచ్‌సీలో శనివారం డాక్టర్స్‌డే సందర్భంగా పలువురు వైద్యులను లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. రాఘవాపూర్ మెడికల్ ఆఫీసర్ లావణ్యతో పాటు కీర్తన, శిరీష, అభినవ్‌ను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు భిక్షపతి, వెంకటేశ్, లతీఫ్, శ్రీనివాస్, సంపత్‌రావు, రాజు, అజయ్ ఉన్నారు.

సేవా కార్యక్రమాలు..

లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ లయనిస్టిక్ డే ను పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు తెలిపారు. చందపల్లిలో డయాబెటిక్ క్యాంపు, పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. తపాలా ఉద్యోగులను సన్మానించారు. ప్రతినిధులు డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, బాబురావు, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, జైపాల్‌రెడ్డి, రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: మండల కేంద్రంలో డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో వాసవి వనిత క్లబ్, క్వీన్ క్లబ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు వేరువేరుగా డాక్టర్లను సన్మానించారు. వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ రీజినల్ చైర్మన్ ఎల్లంకి రాజన్న, క్లబ్ అధ్యక్షుడు కాసం సత్యనారాయణ, కోశాధికారి అల్లంకి హరీశ్ కుమార్, వనిత క్వీన్స్ క్లబ్ అధ్యక్షురాలు యాంసాని రమాదేవి, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వసుధ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి వలస నీలయ్య, డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్లు శ్రీనివాస్, అశోక్ ఉన్నారు.

ట్రినిటీ ప్రైమరీస్కూల్‌లో డాక్టర్స్‌డే

పెద్దపల్లిరూరల్: పట్టంణంలోని ట్రినిటీ ప్రైమరీ పాఠశాలలో శనివారం డాక్టర్స్‌డే వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో చదివే చిన్నారులు వైద్యుల వేషధారణలో పరీక్షలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, ట్రినిటీ విద్యాసంస్థల అధినేత దాసరి ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్స్ దంపతులకు సన్మానం

రామగుండం: అంతర్గాం మండల పరిధి లింగాపూర్‌కు చెందిన న్యూరో సైక్రియాట్రిస్టు, ప్రొఫెసర్ డాక్టర్ సుద్దాల లక్ష్మణ్–దంత వైద్య నిపుణులు డాక్టర్ స్వప్నిక దంపతులను బీఆర్‌ఎస్ ప్రతినిధి సాగర్ నేతృత్వంలో సన్మానించారు.


వైద్యుల వేషధారణలో చిన్నారులు

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్స్, పోస్టల్ డే వేడుకలు నిర్వహించారు. సెంటినరీకాలనీ సింగరేణి డిస్పెన్సరీలో డాక్టర్లు చక్రవర్తి, అనురాధ, శరణ్య, బేగంపేట పీహెచ్‌సీ డాక్టర్ ప్రమోద్‌కుమార్, పోస్టాఫీసులో పోస్టు మేనేజర్ నాగేంద్ర చారిని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ సన్మానించారు.

‘మంత్రి ఆరోపణలు అవాస్తవం’


మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జరిగిన పొరపాట్లపై తాను హైకోర్టులో పిటిషన్ వేస్తే మంత్రి కొప్పుల ఈశ్వర్ తప్పుడు ప్రచారం చేస్తూ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని జెడ్పీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. ధర్మారంలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎన్నికల అధికారులు 79.096శాతం ఓటింగ్ వచ్చినట్లు ధ్రువీకరించారన్నారు. తాను ఆర్‌టీఐ ద్వారా సర్టిఫికెట్ కాపీ కోసం దరఖాస్తు చేస్తే 80.01 ఓటింగ్ శాతంగా ధ్రువీకరణ పత్రాలు అందించారని ఆయన తెలిపారు. వీటన్నింటినీ కోర్టులో సమర్పించానని చెప్పారు. కాగా తాను సానుభూతి కోసం కోర్టుకు వెళ్లినట్లు సోషల్ మీడియా ద్వార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నాలుగున్నరేళ్లుగా స్పందించని మంత్రి ఎన్నికల ముందు మాట్లాడటం సానుభూతి కోసం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, నాయకులు బద్దం నర్సింహారెడ్డి, కాంపెల్లి రాజేశం, ఈదుల శ్రీనివాస్, మోటపలుకుల సత్యం, కరేటి వేణు, పోల్‌దాసరి సంతోష్, మెండ మహేందర్, మెట్‌పల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్త్యాల సర్పంచ్‌కు ఇంటర్నేషనల్ ఉమెన్స్ అవార్డు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల సర్పంచ్ లావణ్య ఇంటర్నేషనల్ ఉమెన్స్ పార్లమెంట్ అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలోని సామ్రాట్ హోటల్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రపంచలోని 46 దేశాల్లోని 56 మంది మహిళలు ఎంపికకాగా భారత్ నుంచి 10 మంది మహిళలు ఈ అవార్డు అందుకున్నారు. పెద్దపల్లి జిల్లా నుంచి ముస్త్యాల సర్పంచ్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ అవార్డు రావడానికి సహకరించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ దేశాల ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.


అవార్డు అందుకుంటున్న సర్పంచ్ లావణ్య

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

మంథని: పట్టణ శివారులోని కబరస్తాన్ ప్రహరీ నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ప్రారంభించారు. పనుల కోసం రూ.10లక్షలు మంజూరైనట్లు తెలిపారు.


పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శైలజ

పాఠశాలకు విరాళం

మంథని: ముత్తారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ రూ.2లక్షల విలువైన వస్తువులు విరాళంగా అందించారు. 17 మంది విద్యార్థులకు సైకిళ్లు, పాఠశాలకు కంప్యూటర్, బీరువాలు, వందవంది విద్యార్థులకు బ్యాగులు అందించినట్లు నిర్వాహకుడు కొల్లేటి సతీశ్ తెలిపారు. వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్, హెచ్‌ఎం హైమావతి ఉన్నారు.


విరాళంగా అందించిన వస్తువులు

ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి మండలం మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి కల్వచర్ల వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లొంకకేసారం గ్రామానికి చెందిన కారుపాకల సిద్ధార్థ్ రెండు కాళ్లు విరిగి హైదరబాద్ గాంధీ ఆస్పత్రికిలో చికిత్స పొందుతున్నాడు. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం బాలుడిని పరామర్శించారు. ఇసుక లారీ ఢీకొని సిద్ధార్థ్ తండ్రి సతీశ్ అక్కడిక్కడే మృతి చెందగా సిద్ధార్థ్ రెండు కాళ్లు విరిగి చికిత్స పొందుతున్నాడు. బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆస్పత్రి వైద్యులకు సూచించారు.

టీ షర్టులు, బట్టసంచులు అందజేత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, ఎదులాపూర్, దుబ్బపల్లి గ్రామాల్లో శనివారం కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్ పంపించిన టీషర్టులు, బట్టసంచులను అందజేశారు. కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు బింగి రాజు, ప్రధాన కార్యదర్శి చాతళ్ల కాంతయ్య, జిల్లా నాయకులు సాయినాథ్, మహేశ్, నాగరాజు, శివ, గణేశ్, చిప్ప శ్రీకాంత్, కైలాసం పాల్గొన్నారు.

జాతీయ పోస్టల్ దినోత్సవం

సుల్తానాబాద్: పట్టణంలోని గణేశ్‌నగర్‌లో జాతీయ పోస్టల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ తపాలా బట్వాడ ఉద్యోగులు నరసింహమూర్తి, గుర్రం శ్రీనివాస్‌ను సన్మానించారు. లయన్స్ క్లబ్ మండల చైర్మన్ నోముల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి వలస నీలయ్య, డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్లు మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, కార్యదర్శి ఆడెపు సమ్మయ్య, పూర్వ అధ్యక్షులు దీకొండ భూమేష్ కుమార్, కోడూరి సతీశ్‌కుమార్, పిట్టల వెంకటేశ్, నూతన సభ్యులు ఏనుగు నరేందర్‌రెడ్డి, తమ్మనవేణి సతీశ్, పూసాల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

బసంత్‌నగర్‌లో ఉచిత కంటివైద్య శిబిరం

పాలకుర్తి: బసంత్‌నగర్‌లో ఆలయ ఫౌండేషన్, శంకర్ విజన్ ఆధ్వర్యంలో ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి నిర్మించిన శంకర్ విజన్ కంటి ఆసుపత్రి ఆవరణలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి కంటి పరీక్షల కోసం వచ్చిన వారికి వైద్యులు బషీర్ అహ్మద్ కంటి పరీక్షలు చేశారు. ఆపరేషన్ అవసరమున్న వారిని గుర్తించి హైదరాబాద్‌లోని శంకర్ విజన్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు వారు తెలిపారు. ఆలయ ఫౌండేషన్ సభ్యులు పరికిపండ్ల రాము, హరీశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యులు

సంక్షిప్త వార్తలు

✦ దాడి చేసిన వ్యక్తిపై కేసు

రామగుండం: రుణంగా తీసుకున్న డబ్బులు చెల్లించాలని అడిగేందుకు వెళ్లిన ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులపై దాడికి పాల్పడిన ఘటన శనివారం అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల గ్రామంలో చోటు చేసుకుంది. అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పొట్యాలకు చెందిన రావుల రాజ్‌కుమార్ రూ.1.40 లక్షల రుణం తీసుకున్నాడు. రుణం చెల్లించాల్సిన గడువు పూర్తయినప్పటికీ చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు పొట్యాలలోని రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లి రుణం చెల్లించాలని కోరారు. రాజ్‌కుమార్ కర్రతో భౌతిక దాడికి పాల్పడడంతో సురేశ్ ఎడమ చేతి ఎముక విరగడంతో అంతర్గాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

✦ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నాగరాజు

ఓదెల: ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఓదెల గ్రామానికి చెందిన కొండ్ర నాగరాజు ఎన్నికైనట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొండ్ర శంకర్ శనివారం ప్రకటించారు. తన ఎన్నికకు సహకరించిన ప్రధాన కార్యదర్శి శంకర్‌కు, జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌మాదిగ, జిల్లా ఇన్‌చార్జి పెరక నవీన్‌కు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

✦ నియామకం

పెద్దపల్లిరూరల్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నాగరాజును నియమించినట్లు జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్ తెలిపారు.

ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్‌గా అజయ్

ఎలిగేడు: ఎలిగేడు మండలం ధూళికట్టకు చెందిన అజయ్‌ను కరీంనగర్ విభాగ్(కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, ఆసిఫాబాద్) కన్వీనర్‌గా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు నియమించినట్లు అజయ్ తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతానన్నారు.

✦ రైస్‌మిల్ కార్మికులకు వేతనాలు పెంచాలి

మంథని: రైస్‌మిల్ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. మంథని ప్రాంతంలోని రైస్ మిల్లులను శనివారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. మిల్ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర అంజయ్య, సీఐటీయూ మంథని డివిజన్ నాయకుడు బూడిద గణేశ్ ఉన్నారు.

✦ ఏబివైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరుపతియాదవ్

సుల్తానాబాద్: అఖిల భారత యువ యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జూలపల్లికి చెందిన మారం తిరుపతి యాదవ్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలబోయిన రమేశ్‌యాదవ్ శనివారం కరీంనగర్‌లో ఉత్తర్వులు అందజేశారు.

మాదిరెడ్డి భాస్కర్‌రావు వర్ధంతి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఏఐటీయూసీ కార్యాలయంలో కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్‌రావు వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాశ్, బ్రాంచ్ కార్యదర్శి రాజారత్నం, అన్నారావు, తిరుపతి, సాంబశివరావు, రాజ్‌సాగర్, శంకర్, రాజయ్య, నర్సయ్య పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు